


డీసీసీబీ పాలకవర్గ పదవీ కాలం పొడిగింపు

విజయనగరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలకవర్గ పదవీ కాలాన్ని ఈ ఏడాది జూలై 17 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాలకవర్గం పదవీ కాలం ఈ నెలతో ముగియనుంది. ఈ నేపథ్యంలో చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడుతో పాటు ఏడుగురు సభ్యుల పదవీకాలాన్ని ప్రభుత్వం పెంచింది. పర్సన్ ఇన్‌చార్జిలుగా కొనసాగించాలని నిర్ణయించింది. కాగా, ఎన్నికలు నిర్వహించకుండా దొడ్డిదారిన ప్రభుత్వం పదవీకాలం పెంచడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● అధికార పార్టీ ఎమ్మెల్యేల్లో అభద్రతాభావం

● ఇప్పటికే రాజాం ఎమ్మెల్యేకి స్థానచలనం ● అందరి చూపూ నాలుగో జాబితాపైనే..

ఎవరి సీటు పోతుందో?



(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులుకు జిల్లాలో టిక్కెట్టు దక్కలేదు. ఆయన్ను పాయకరావుపేట నియోజకవర్గానికి బదిలీ చేశారు. అలాగే విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు కూడా ఈ సారి ఎన్నికల్లో టిక్కెట్టు ఇచ్చే పరిస్థితి కన్పించడం లేదు. ఇప్పటికే జగన్ స్పష్టతనిచ్చినట్లు సమా చారం. అలాగే వైసీపీ మూడో జాబితాలో మాజీ ఎంపీ బొత్స ఝాన్సీకి విశాఖ లోక్‌సభ స్థానం కేటాయిస్తున్నట్లు ప్రక టించారు. ఈ నేపథ్యంలో నాలుగో జాబితాలో తమ భవి ష్యత్ పరిణామాలు ఎలా ఉంటాయో అన్న ఆందోళన అధి కార పార్టీ ఎమ్మెల్యేల్లో గూడు కట్టుకుంది. అయితే ఏ ఎమ్మె ల్యేకు ఎసరు పెడతారో అన్న చర్చలు జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. దీనికితోడు కొంత మంది ఎమ్మెల్యేలను ద్వితీయ శ్రేణి నాయకులు తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్న తరుణంలో అలాంటి వారి భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

● విజయనగరం ఎంపీ స్థానానికి జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును నియమించినట్లు ప్రచారం సాగింది. చివరి నిముషంలో ఏమైందో ఏమో అధికారిక జాబితాలో ఆయన పేరు లేదు. దీనికి కారణం జడ్పీ చైర్మన్.. ఎంపీ కన్నా ఎమ్మెల్యే సీటు రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. తనకు ఎస్.కోట, బొబ్బిలి, ఎచ్చెర్లలో ఎక్కడ కేటాయించినా పోటీ చేస్తానని ప్రతిపాదించినట్లు సమాచారం. దీన్ని దృష్టిలో పెట్టుకునే లోక్‌సభకు వెళ్లకుండా అసెంబ్లీ సీటు కేటాయించే ఉద్దేశంతోనే అధినాయకత్వం చివరి నిముషంలో విజయనగరం లోక్‌సభ ఇన్‌చార్జి పేరు తొలగించినట్లు ప్రచారం సాగుతోంది. ఇదే జరిగితే ఎస్.కోట, బొబ్బిలి, ఎచ్చెర్ల స్థానాల్లో దేన్ని కేటాయిస్తారు? అన్నది కూడా చర్చనీయాంశం అవుతోంది. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌కు వచ్చేఎన్నికల్లో టిక్కెట్టు ఇచ్చేది లేదని ఇప్పటికే స్పష్టమైంది. మరి జడ్పీ చైర్మన్ చిన్న శ్రీను ఇక్కడి నుంచే పోటీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు ఎంపీ బెల్లాన కూడా ఎచ్చెర్ల ఎమ్మెల్యే టిక్కెట్టును కోరుతున్నారన్న ప్రచారం ఉంది.

ఎస్.కోటలో అసమ్మతి స్వరం..

ఎస్.కోట నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్టు కేటాయిస్తే తాము సహకరించేది లేదని కొంతమంది స్థానిక ప్రజా ప్రతినిధులు, ద్వితీయ శ్రేణి నాయకులు హెచ్చరిస్తున్నారు. వీరంతా ఎమ్మెల్సీ రఘురాజు వర్గంగా ఉన్నారు. కడుబండికి టిక్కెట్టు ఇవ్వవద్దని ఎప్పటికప్పుడు అధినాయకత్వానికి ఫిర్యాదులు చేస్తున్నారు. ఎమ్మెల్సీతో పాటు మరికొన్ని రహస్య శక్తులు పనిచేస్తున్న తరుణంలో మార్పు తప్పదన్న ప్రచారం సాగుతోంది. అయితే కడుబండికి రాష్ట్ర స్థాయిలో కీలక నాయకుని పట్టున్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగా వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్నా అధినాయకత్వం గుమ్మనంగా ఉంటోంది. అయితే మరో వాదన కూడా విన్పిస్తోంది. గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యను ఎస్.కోటకు, ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండికి గజపతినగరం కేటాయించే అవకాశం ఉందన్న చర్చకూడా ఉంది.

బొబ్బిలిలో తీవ్ర వ్యతిరేకత..

బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడుపైనా తీవ్ర వ్యతిరేకత ఉంది. స్థానిక ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీలను గెలిపించుకోవటంలో ఆయన వెనకబడ్డారు. ఇటీవల వైసీపీ నుంచి టీడీపీ వలసలు భారీగా సాగుతున్నాయి. భూ కబ్జాలకు ఎమ్మెల్యే పాల్పడుతున్నారని ఇటీవల ప్రతి పక్షనేత చంద్రబాబు నాయుడు బొబ్బిలిలో ధ్వజమెత్తారు. ఈ పరిస్థితుల్లో శంబంగికి ఈసారి టిక్కెట్టు ఇచ్చే అవకాశాలు తక్కువేనని.. మార్పు తథ్యం అన్న ప్రచారం సాగుతోంది.

పోలింగ్ స్టేషన్ల కోసం

పాఠశాలలను సిద్ధం చేయాలి

● 15 రోజుల్లో పనులు పూర్తి కావాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్, జనవరి 12: పోలింగ్ కేంద్రాలుగా వినియోగించేందుకు పాఠశాలలను సిద్ధం చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో అన్ని మౌలిక సదుపాయాలు ఉండాలని చెప్పారు. తాగునీరు, మరుగు దొడ్లు, ర్యాంపులు, విద్యుత్, ఫర్నిచర్, నేమ్ బోర్డులు తప్పసరిగా ఉండాలని తెలిపారు. జిల్లాలో మొత్తం 1,847 పోలింగ్ కేంద్రాలకు 223 మంది సెక్టార్ అధికారులను నియమించామని, వారంతా ఇప్పటికే ఆయా పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి నివేదికలు సమర్పించారని తెలిపారు. దీని ప్రకారం 397 పాఠశాలల్లో ర్యాంపులు, 204 పాఠశాలల్లో నేమ్ బోర్డులు, 83 స్కూళ్లల్లో తాగునీటి సదుపాయం, 75 బడుల్లో మరుగుదొడ్లు, 67 పాఠశాలల్లో ఫర్నిచర్, 27 పాఠశాలల్లో ఫ్యాన్లు, లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని చెప్పారు. వెంటనే పనులు ప్రారంభించి 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. చాలా పాఠశాలల్లో ఇప్పటికే ఆర్‌వో ప్లాంటు, మరుగుదొడ్లు ఉన్నాయన్నారు. అవిలేని చోట తాత్కాలిక పద్ధతిలోనైనా ఏర్పాటు చేయాలని సూచించారు. శాశ్వత అవసరాలకు వినియోగించే విధంగా విద్యుత్ సదు పాయాన్ని కల్పించాలన్నారు. ఫ్యాన్లు, లైట్లు అన్ని గదుల్లో ఉండాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ బూత్‌లోకి సులువుగా చేరుకొనే విధంగా నిర్దేశిత ప్రమాణాలతో ర్యాంపులను నిర్మించాలని తెలిపారు. అవకాశం ఉంటే రెయిలింగ్ కూడా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో 147 పోలింగ్ బూత్‌లు మాత్రమే ప్రభుత్వేతర భవనాల్లో ఉన్నాయని చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్వో అనిత, డీఈవో లింగేశ్వరరెడ్డి, ఐసీడీఎస్ పీడీ శాంతి కుమారి, గృహ నిర్మాణ పీడీ శ్రీనివాసరావు, డీటీఈవో భీమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి మాఫియా

● చెరువుల్లో అడ్డగోలు తవ్వకాలు ● వందలాది ట్రాక్టర్లతో తరలింపు

● అధికార పార్టీ నాయకులు, ట్రాక్టర్ల యజమానుల కుమ్మక్కు

● గొయ్యిలతో ధ్వంసమవుతున్న సాగునీటి వనరులు

● పట్టించుకోని అధికారులు

ఈ ఏడాది వర్షాలు ఆశించినంత లేకపోవడంతో చెరువుల్లో నీరు చేరలేదు. ఇదే అదునుగా స్థానిక అధికార పార్టీ నాయకులు, ట్రాక్టర్ల యజమానులు కుమ్మక్కై చెరువుల్లో మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. రాత్రిపగలూ తేడా లేకుండా యంత్రాలతో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు చేపట్టి వందలాది ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ట్రాక్టర్ లోడు రూ.వెయ్యికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి తవ్వకాలతో చెరువులు ధ్వంసమవుతున్నాయి. దీనివల్ల సాగునీటికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు అటు వైపుగా చూడకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. -రాజాం, జనవరి 12



రాజయ్యపేట గ్రామంలో చెరువులో మట్టి తవ్వకాలు చేస్తున్న దృశ్యం

రాజాం నియోజకవర్గంలో మట్టి మాఫియా పెట్రేగిపోతోంది. సంతకవిటి, రాజాం, రేగిడి ఆమదాలవలస, వంగర మండలాల్లో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు చేపట్టి దోచుకుంటుంది. ముఖ్యంగా రాజాం మండలంలోని ఆగూరు రాజయ్యపేట, కొత్తవలస, కొత్తకంచరాం, పెనుబాక, ఎంజేవలస, బొమ్మనాయుడువలస, గారాజు చీపురుపల్లి, వస్త్రపురికాలనీ, తదితర గ్రామాల్లోని చెరువుల్లో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గ్రామాల్లో చోటా నాయకులు, ట్రాక్టర్ యజమానులు సిండికేటుగా మారి మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. దీంతో చెరువులు పూర్తిగా ఆనవాళ్లు కోల్పోతున్నాయి. ఇప్పటికే చెరువుల మదుములు, చప్టాలు దెబ్బతిన్నాయి. రోజుకు వందల సంఖ్యలో ట్రాక్టర్లు మట్టి లోడ్లతో రాకపోకలు సాగిస్తుండడంతో గట్లు సైతం కోతకు గురై బలహీనంగా మారుతున్నాయి. దీంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. మట్టి తవ్వకాలను అడ్డుకునేందుకు మైనింగ్ అధికారులు కొంతమంది సిబ్బందిని నియమించారు. అయితే, వీరు ట్రాక్టర్ యజమానులు నుంచి మామ్మూళ్లకు కక్కుర్తిపడి మట్టి తవ్వకాలను అడ్డుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మరోపక్క మైనింగ్, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం కొరవడింది. సమష్టిగా మట్టి తవ్వకాలను నియంత్రించాల్సింది పోయి తమ పనికాదన్నట్టు ఇరుశాఖల సిబ్బంది వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

నిబంధనలకు తూట్లు..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రావెల్, మట్టి తవ్వకాలు చేపట్టాలంటే మైనింగ్, రెవెన్యూ శాఖల నుంచి అనుమతి తీసుకోవాలి. క్యూబిక్ మీటర్ తవ్వకానికి రూ.150 నుంచి రూ.200 వరకు ప్రభుత్వానికి చెల్లించాలి. ఆ తరువాతే తవ్వకాలు చేపట్టాలి. కానీ, ఇవేమీ రాజాం నియోజకవర్గంలో కనిపించడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. ప్రస్తుతం రాజాం పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో గృహ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. కొన్నిచోట్ల రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలుస్తున్నాయి. వీటికి మట్టి అవసరం కావడంతో దానికి గిరాకీ పెరిగింది. ప్రభుత్వ స్థలాలు, చెరువుల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలిస్తున్నారు. ఒక ట్రాక్టరు లోడు రూ.1000 పైమాటే. ఏకంగా యంత్రాలు పెట్టి తవ్వేస్తున్నారు. అడుగుల మేర లోతులో మట్టిని తీసి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ఏ చెరువు చూసినా గోతులమయంగా మారిపోయింది. కొన్ని గ్రామాల్లో గ్రామాభివృద్ధి పేరిట తవ్వకాలు చేపడుతున్నారు. లోడుకు రూ.50, రూ.100 రేటు కట్టి తరలిస్తున్నారు. బయట మాత్రం ట్రాక్టర్ మట్టి లోడును రూ.1000కి విక్రయిస్తున్నారు. అంత ధర ఎందుకంటే మైనింగ్ శాఖ, రెవెన్యూ శాఖకు డబ్బులు కడుతున్నామని అక్రమార్కులు చెబుతున్నారు. మట్టి తవ్వకాలపై తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు కంచరాం సర్పంచ్ తెలిపారు. వారు పూర్తిస్థాయిలో స్పందించకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వీఆర్వోలకు ఆదేశాలు ఇచ్చాం..

చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరగకుండా చూడాలని వీఆర్వోలకు ఆదేశాలు ఇచ్చాం. తవ్వకాలు చేపట్టిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించాం. వినకపోతే వాహనాలను సీజ్ చేయాలని చెప్పాం. అనుమతులు లేకుండా తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు. ఎక్కడైనా తవ్వకాలు జరిగినట్లు ఫిర్యాదు అందిస్తే సంబంధిత వీఆర్వోలపై చర్యలు తీసుకుంటాం.

-కృష్ణంరాజు, తహసీల్దార్, రాజాం

చెరువులను ధ్వంసం చేస్తున్నారు..

మా కళ్లెదుటే చెరువులను ధ్వంసం చేస్తున్నారు. యంత్రాలతో మట్టి తీసి ట్రాక్టర్లలో తరలించుకుపోతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే అనుమతులు ఉన్నాయని చెబుతున్నారు. కనీసం గ్రామంలో ఉండే సచివాలయం సిబ్బంది కూడా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులకు చెబితే మా పని కాదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.

-రామినాయుడు, రైతు, వస్త్రపురికాలనీ

ఉన్నతాధికారులే పట్టించుకోవాలి..

చెరువుల్లో మట్టి తవ్వకాలు అక్రమంగా చేపడుతున్నా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదు. నాయకులు, ట్రాక్ట ర్ల యజమానులు కుమ్మక్కై మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. రాజాం పట్టణంలో గృహ నిర్మాణాలకు మట్టి అవసరం ఎక్కువగా ఉండడంతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. చెరువులను నాశనం చేస్తుండడంతో ఆయకట్టు రైతులు సాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులే స్పందించాలి.

-చంద్రినాయుడు, రైతు, కంచరాం

అంగన్‌వాడీల

సమ్మె ఉధృతం



విజయనగరంలో శిబిరం వద్ద నిద్రపోతున్న అంగన్‌వాడీలు

● వినూత్నంగా నిరసనలు ● జిల్లాలో సంతకాల సేకరణ

విజయనగరం (ఆంధ్రజ్యోతి) జనవరి 12: తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు ఉద్యమిస్తున్నారు. వినూత్న రీతిలో నిరసనలు చేపడుతు న్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. ఎస్మా ప్రయోగించినా, కేంద్రాల తాళాలు పగులగొట్టినా, రాజ కీయ నాయకులతో భయపెట్టినా తగ్గేదేలే అంటూ పోరును మరింత ఉధృతం చేస్తున్నారు. అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా, వారి పోరాట పటిమకు సంఘీభావం తెలుపుతూ రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల శిబిరాల వద్ద శుక్రవారం నుంచి సంతకాల సేకరణ మొదలయ్యింది. కలెక్టరేట్ వద్ద చేపడుతున్న నిరవధిక సమ్మెలో సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరావు మాట్లాడుతూ.. 32 రోజులుగా అంగన్‌వాడీలు పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణమే వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు బి.పైడిరాజు, సుధారాణి, తదితరులు పాల్గొన్నారు. మెరకముడిదాం మండల కేంద్రంలో అంగన్‌వాడీలు సంక్రాంతి పిండి వంటలు చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. వీరికి సీఐటీయూ నాయకులు టీవీ రమణ తదితరులు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వంతో శుక్రవారం జరిగిన చర్చలు విఫలమయ్యాయని, సమ్మెను మరింత ఉధృతం చేస్తామని టీవీ రమణ తెలిపారు. బాడంగి మండలంలో అంగన్‌వాడీలు జీవో నెంబరు 2 పత్రాలను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. రామభద్రపురం మండలంలో చీర కొంగులతో వాహనాలను శుభ్రం చేసి నిరసన తెలిపారు.



మెరకముడిదాంలో సంక్రాంతి పిండివంటలు చేస్తున్న అంగన్‌వాడీలు



బాడంగిలో జీవో నెంబరు 2 పత్రాలను భోగిమంటల్లో దహనం చేస్తున్న దృశ్యం



రామభద్రపురంలో చీర కొంగులతో వాహనాలు శుభ్రం చేస్తున్న అంగన్‌వాడీలు

భర్తే కాలయముడై..

● భార్యను దుక్కతో కొట్టి చంపేసిన వైనం

● తాగొద్దన్నందుకు ఘాతుకం ● కొండగండ్రేడు గ్రామంలో ఘటన



లక్ష్మి (ఫైల్)

గుర్ల, జనవరి 12: కట్టుకున్న భర్తే ఆమె పాలిట కాలయముడయ్యాడు. మద్యం తాగవద్దని, అప్పులు చేయవద్దని భర్తకు చెప్పడమే ఆమె నేరమైంది. దీంతో కోపంతో ఊగిపోయిన ఆ భర్త పక్కనే ఉన్న దుక్క (పశువుల మెడలో వేసే చెక్క)తో భార్య తలపై కొట్టి చంపేశాడు. ఈ ఘటన గుర్ల మండలం కొండగండ్రేడు గ్రామంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసుల వివరాల మేరకు.. కొండగండ్రేడుకు చెందిన మునకాల సత్యం, లక్ష్మి (45) దంపతులు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కౌలుకు కొంత భూమిని తీసుకుని దంపతులు సాగు చేస్తున్నారు. సత్యం మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకునే వాడుకాదు. అప్పు చేసి మద్యం తాగడంతో పాటు పేకాట ఆడేవాడు. దీంతో భార్యాభర్తల మధ్య నిత్యం గొడవలు జరుగుతుండేవి. గురువారం సాయంత్రం కల్లం వద్ద ఆవుకు పాలు తీస్తుండగా మరోసారి వారి మధ్య గొడవ జరిగింది. ఇష్టం వచ్చినట్లు అప్పులు చేసి ఇళ్లను గుళ్ల చేసి తనకు, పిల్లలకు ఎలాంటి ఆధారం లేకుండా చేస్తున్నావని లక్ష్మి.. సత్యంను మందలించింది. దీంతో కోపోద్రిక్తుడై పక్కనే ఉన్న దుక్కతో భార్య తలపై మోదాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. అక్కడి నుంచి సత్యం పరారయ్యాడు. ఘటనా స్థలాన్ని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రరావు, గరివిడి ఎస్‌ఐ దామోదరావు పరిశీలించారు. గ్రామస్థులను విచారించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సత్యం కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్టు పోలీసులు తెలిపారు.



లక్ష్మి మృతదేహం

మళ్లీ పోదాం.. మట్టింటికే!

- మట్టితో నిర్మించిన ఇళ్లే ఆరోగ్యం
- సంప్రదాయ నిర్మాణాలు కొనసాగేలా కొత్త టెక్నాలజీ
- రసాయన ఇబ్బందులు లేవు.. ఖర్చూ తక్కువే
- అవగాహన కల్పిస్తున్న యువకులు



మట్టితో తయారు చేసిన ఇంటి నమూనా

మెరకముడిదాం


మన పూర్వీకులంతా దాదాపుగా మట్టి ఇళ్లల్లోనే ఉండేవారు. ఈ విషయం గ్రామాల్లో ఉండే కొంతమందికి తెలిసే ఉంటుంది. మట్టి గోడలు, కమ్మలతో ఏర్పాటుచేసిన పైకప్పు, మట్టి గచ్చు (నేల)తో ఇంటి నిర్మాణం జరిగేది. ఈ మట్టి ఇంటి నిర్మాణం చాలా త్వరగా, తక్కువ ఖర్చుతో పూర్తయ్యేది. కానీ కాలక్రమంలో, టెక్నాలజీ పెరుగుతున్న ఈ రోజుల్లో దాదాపుగా ఈ మట్టి ఇళ్లు కనుమరుగయ్యాయి. కానీ మళ్లీ మట్టి ఇళ్ల ప్రాధాన్యం వివరిస్తూ, వాటి నిర్మాణాలపై శిక్షణ ఇస్తున్నారు జిల్లాకు చెందిన కొంతమంది యువకులు. మట్టి ఇళ్లు ఆరోగ్యకరమంటూ, వాటినే నిర్మించు కోవాలని సూచిస్తున్నారు.

రసాయనాలతో కూడిన ముడిసరుకుల జోలికి పోకుండా ఆరోగ్య వంతమైన ఇళ్ల నిర్మాణాలపై ఓ యువకుడు దృష్టి పెట్టారు. సహజ సిద్ధంగా లభ్యమయ్యే మట్టితో పూర్వకాలంలో ఇళ్ల నిర్మాణ టెక్నాలజీ అంత రించిపోకుండా యువతకు శిక్షణ అందిస్తున్నారు. స్థానికంగా లభ్యమయ్యే వనరులతోనే ఆరోగ్యవంత మైన ఇంటిని నిర్మించు కునే విధంగా శిక్షణ కార్యక్రమాలు జరుగు తున్నాయి. ఎటువంటి ఖర్చు లేకుండా విరివిగా లభ్యమయ్యే మట్టి ఇళ్ల నిర్మాణాలను ప్రోత్స హించేందుకు జిల్లాలోని మెరకముడిదాం మండలం బొడందొర వలస గ్రామంలో ఆర్కిటెక్చర్ ఆదిత్య శర్మ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈయన కిషోర్ అనే మరొకరితో కలిసి ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆరోగ్యానికి ఈ మట్టి ఇళ్లు ఎంత గానో మేలు చేస్తుందని వెల్లడిస్తున్నారు.



మట్టితో నిర్మించిన ఇంటిలోపల భాగం

శిక్షణ ఇస్తున్నాం...



మట్టి ఇళ్ల నిర్మాణాలపై ఇప్పటి వరకూ 1,600 మందికి శిక్షణ ఇచ్చామని ఆదిత్య శర్మ చెపుతున్నారు. ఇతర దేశాల వారు కూడా ఆసక్తిగా శిక్షణ పొందుతున్నారని వివరించారు. విజయనగరం జిల్లాలో కూడా విస్తృతంగా యువతీ, యువకులకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. మంచి ఆరోగ్యం కోసం మట్టి ఇళ్ల నిర్మాణాల ఆవశ్యకత ఎంతో ఉందన్నారు.



నిర్మాణం ఇలా..

- ఖాళీ సిమెంటు బ్యాగులను శుభ్రపరిచి వాటిలో మట్టి నింపి వరుసగా పేర్చుతారు. ఖాళీల వద్ద మట్టిని అద్ది గోడలను సిద్ధం చేస్తారు. ద్వారబందాలు, కిటికీలు సహజ సిద్ధంగా లభ్యమయ్యే కలపతోనే తయారు చేస్తారు. ఇంటి పైకప్పును కూడా సహజసిద్ధంగా లభ్యమయ్యే దృఢమైన కలప దుంగలను పేర్చి మట్టిని అద్ది పైకప్పును తయారు చేస్తారు. వర్షం పడినపుడు పైకప్పు మట్టి కరిగిపోకుండా గడ్డి మేట్లు వేసి కోతకు గురికాకుండా ఏర్పాట్లు చేస్తారు. ఇలా సహజ సిద్ధ ముడి సరకులతో నిర్మాణాలు చేపడుతున్నారు.
- రసాయనాలతో తయారు చేసే సిమ్మెంటు, ఐరన్ వంటి ముడిసరకులను వాడటం ద్వారా కాలుష్యం ఏర్పడుతుంది. మనిషి ఆహారంలో ఆర్గానిక్ ఫుడ్ ఎంత అవసరమో మట్టితో నిర్మించే ఇళ్లు కూడా అంతూ ఆరోగ్యం. ఈ టెక్నాలజీ ద్వారా అతి తక్కువ ఖర్చుతో నివాస గృహాలను నిర్మించుకోవటం సాధ్యమవుతుంది. ఖర్చు కూడా స్వల్పంగా ఉండడంతో, ఇంటి లోపల కలపతో తయారు చేసిన ఇంటీరియల్ ఏర్పాటు చేసుకోవచ్చు. సుమారు లక్ష రూపాయలు ఖర్చు చేస్తే చక్కనైన ఆరోగ్య వంతమైన ఇళ్లు ఇక్కడ సాధ్యమే. ఏది ఏమైనా పురాతన టెక్నాలజీ కాల గర్భంలో కలిసి పోకుండా తక్కువ ఖర్చుతో ఆరోగ్యవంతమైన ప్రకృతి సిద్ధ ఇంటి నిర్మాణం అందరిలోనూ ఆసక్తిని రేపుతోంది.

అంబేడ్కర్ అందరివాడు

- కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్, జనవరి 12: కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల వారి అభ్యున్నతి కోసం పాటు పడిన అంబేడ్కర్ అందరివాడని కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. సామాజిక సంకల్ప మహోత్సవంలో భాగంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అంబేడ్కర్ జీవిత చరిత్రను తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ అధికారి రామానందం, పర్యాటక శాఖ అధికారి లక్ష్మీనారాయణ, జీఎస్ డబ్ల్యూవో నిర్మలాదేవి, దళిత సంఘ నాయకులు జయరాజ్, భానుమూర్తి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అదనపు గదులు ప్రారంభం



అదనపు గదులను ప్రారంభిస్తున్న ఎస్పీ దీపిక

విజయనగరం క్రైం, జనవరి 12: జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో కమ్యూనికేషన్ విభాగానికి నిర్మించిన నూతన గదులను ఎస్పీ దీపిక శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమ్యూనికేషన్ విభాగంలో పనిచేసే మహిళా సిబ్బంది వేచి ఉండేందుకు, కమ్యూనికేషన్ పరికరాలు ఉంచేందుకు రెండు గదులను శ్రమ దానంతో నిర్మించామన్నారు. శ్రమదానం చేసిన పోలీసు సిబ్బంది, హోంగార్డులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అస్మాపరహీన్, ట్రైనీ ఐపీఎస్ మండా జావలి ఆల్ఫాన్, డీఎస్పీలు విశ్వనాథ్, ఆర్.గోవిందరావు, ఆర్.శ్రీనివాసరావు, యూనివర్స్, సీఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

24 గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులు



పనులు పరిశీలిస్తున్న డీఈ పైడిరాజు తదితరులు

వేపాడ, జనవరి 12: మండలంలోని 24 గ్రామాల్లో రూ.535 లక్షలు జలజీవన్ నిధులతో తాగునీటి సరఫరా పనులు చేపడుతున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఆర్.వి. పైడిరాజు తెలిపారు. శుక్రవారం బంగారయ్యపేట, కోటయ్యగరువు, చిట్టివానిపాలెం గ్రామాల్లో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలో ఎస్సీ ఎస్టీ పథకం కింద నిధులు మంజూరు కాని గ్రామాల్లో కూడా జలజీవన్ నిధులతో మంచినీటి ట్యాంకులు, ఇంటింటి కొళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. పోతుబందిపాలెం, వెంకయ్యపాలెం, కోటయ్యగరువు, చిట్టువానిపాలెం, శొంటివానిపాలెం, సంఘంవలస, బంగారయ్యపేట, నర్సిపల్లి తదితర గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఉగాది నాటికి పనులు పూర్తి చేసి తాగునీరు ప్రజలకు అందించే ఏర్పాట్లు చేస్తున్నట్టు డీఈ తెలిపారు.

ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకుడు రాజు

బొబ్బిలి, జనవరి 12: కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ (ఓపీఎస్) విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్ (257) జిల్లా నాయకుడు జేసీ రాజు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో బంకురు జోగినాయుడు అధ్యక్షతన శుక్రవారం డివిజన్ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులందరికీ దేశవ్యాప్తంగా ఓపీఎస్‌ను అమలు చేస్తున్నారని... మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2018 నుంచి బకాయి పడిన 12 విడతల కరవుభత్యం బకాయిలు, పీఎఫ్, వంటి మొత్తం రూ.32 వేల కోట్లను ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షన్‌దారులందరికీ తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న 22 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఏపీ గురుకుల పాఠశాలల్లో గెస్ట్ టీచర్లుగా పనిచేస్తున్న వారికి 12 సంవత్సరాలుగా రూ.14 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని, వారికి మినిమమ్ టైమ్ స్కేలును వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు ఎల్లయ్య, శ్రీను, రమేష్, పరిశినాయుడు, మోహనరావు, డి.రాములు, చంద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెస్టివల్‌కు కంచరాం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం

రాజాం రూరల్, జనవరి 12: ఈ నెల 17 నుంచి 20 వరకూ ఫరీదాబాద్ (హర్యానా)లో ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఎన్.సి.ఇ.ఆర్.టి. (న్యూఢిల్లీ), కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ, అంతరిక్ష పరిశోధన శాఖ, విజ్ఞాన్ భారతి సంయుక్తంగా నిర్వహిస్తున్న స్టూడెంట్ సైన్స్ విలేజ్‌లో దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రం నుంచి 20 మంది వంతున విద్యార్థులు హాజరుకానున్నారు. ఇక్కడి భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పండూరు వేణుగోపాల్ సారథ్యంలో తొమ్మిదో తరగతి విద్యార్థులు పి.సౌజన్య, పి.శిరీష, పి.చరణ్, పి.సత్యవతి, బి.దినేష్ హాజరవుతున్నారు. వీరు కాంతికి సంబంధించిన ప్రాజెక్ట్‌ను ప్రదర్శిస్తారు. ఈ విద్యార్థులను జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వర రెడ్డి, ఉప విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, హెచ్.ఎం. వసంత కుమార్, సిబ్బంది అభినందించారు.

గ్రంథాలయం ప్రారంభం

రాజాం: గ్రంథాలయాలే దేశ భవితకు బంగారు బాట అని కేంద్ర సాహిత్య అకాడమీ యువజన పురస్కార గ్రహీత ప్రగతి బాలసుధాకర్ అన్నారు. శుక్రవారం కంచరాం గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రజా గ్రంథాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి గ్రామంలోనూ ఇటువంటి గ్రంథాలయాలు ఉండాలని, గ్రంథాలయాలే విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తాయన్నారు.

నగరమంతా పండగ సందడే

- బస్, రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల రద్దీ

విజయనగరం(ఆంధ్రజ్యోతి), జనవరి 12: సంక్రాంతి పండగకు సొంతూళ్లు వచ్చినవారితో పల్లె పులకరిస్తోంది. బతుకు తెరువు, జీవనోపాధి కోసం ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు వెళ్లిన వారు పెద్దపండగ సందర్భంగా కుటుంబాలతో సహా ఇళ్లకు చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లాలోని బస్‌స్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు ప్రయాణికులతో కిక్కిరిసి పోయి, రద్దీ వాతావరణం నెలకొంది.

జిల్లాకు కొత్తగా 4270 రైస్ కార్డులు

కలెక్టరేట్: జిల్లాకు కొత్తగా 4270 రైస్ కార్డులు మంజూరైనట్లు జేసీ మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది జూలై 31 నుంచి వచ్చిన దరఖాస్తులకు ఈ కార్డులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఎండీయూల వద్ద బియ్యం, పంచదార, కందిపప్పు ఈనెల నుంచి తీసుకోవాలని పేర్కొన్నారు.

ధాన్యం డబ్బులు విడుదల

కలెక్టరేట్: జిల్లాలోని ఇప్పటి వరకూ సేకరించిన ధాన్యంకు రూ 351 కోట్లు నిధులు విడుదలైనట్లు జేసీ మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. 494 రైతు భరోసా కేంద్రాలు 65,206 మంది రైతులు నుంచి 2.63 లక్షలు మెట్రిక్ టన్నులు సేకరించామని తెలిపారు.ఇప్పటి వరకూ రూ.113 కోట్లను రైతుల ఖాతాకు జమ చేయగా, శుక్రవారం రూ.351 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. 2023-24 సీజను ఇప్పటి వరకూ రూ.464 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేశామన్నారు.

ధాన్యం సేకరణకు తాత్కాలిక విరామం

కలెక్టరేట్: జిల్లాలోని ధాన్యం సేకరణకు తాత్కాలికంగా విరామం పడనుంది. మిల్లులు వద్ద పని చేస్తున్న హమాలీలు సంక్రాంతి పండగ పనుల్లో నిమగ్నం కానున్న నేపథ్యంలో ఐదు రోజుల పాటు ధాన్యం సేకరణ ప్రక్రియ తాత్కాలికంగా నిలిపివేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులు ట్రక్ షీట్లు జనరేట్ చేసినా, మిల్లుల వద్దకు వెళ్లినా ధాన్యం దించడానికి హమాలీలు ఉండరు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ధాన్యం సేకరణ ఐదు రోజుల పాటు నిలుస్తుంది. గత నెలలో జిల్లాలోని ధాన్యం సేకరణ మొదలు పెట్టారు. ఇప్పటి వరకూ 65 వేలు మంది రైతుల నుంచి 2.63 లక్షలు మెట్రిక్‌టన్నులు సేకరించారు. శుక్రవారం రైతు భరోసా కేంద్రాల్లో జనరేట్ చేసిన ట్రక్ షీట్లు జనరేట్ చేసిన ధాన్యాన్ని శనివారం మిల్లుల వద్ద దించుకుంటారు. అయితే ఈనెల 13 నుంచి నాలుగు రోజుల పాటు మిల్లుల వద్ద హమాలీలు ఉండరు. దీనిని దృష్టిలో పెట్టుకుని అధికారులు నాలుగు రోజుల పాటు ధాన్యం సేకరణకు బ్రేక్ వేస్తున్నారు.

కొత్తపేటలో నేడు దీపారాధన

విజయనగరం రూరల్: నగరంలోని కొత్తపేటలో ధనుర్మాసం సందర్భంగా గత నెల రోజులుగా మేలుకొలుపులు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శనివారం ముగింపు సందర్భంగా వెయ్యి మందితో దీపారాధన.. ఊరేగింపు నిర్వహించనున్నారు.

నిత్యావసరాలు, దుప్పట్ల పంపిణీ

విజయనగరం రూరల్: మారుతీ స్వయం సేవా సంఘ ఆధ్వర్యంలో నిరుపేదలకు శుక్రవారం నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కణపాకలోని ఆగురు వీధిలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వ్యాపారవేత్తలు పెంటపాటి మార్కండేయులు, రాము తదితరులు పాల్గొన్నారు. 75 మందికి బియ్యం, ఇతర నిత్యావసరాలు, దుప్పట్లను పంపిణీ చేశారు. సంఘ ప్రతినిధులు గుత్తూరు చంద్రశేఖర్, అరసాడ అప్పలస్వామి, తులసీరామ్, కోండ్రు కృష్ణారావు పాల్గొన్నారు.

అలరించిన రంగవల్లుల పోటీలు

విజయనగరం రింగురోడ్డు : ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో శుక్రవారం నిర్వహించిన రంగవల్లుల పోటీలు ఎంతో అలరించాయి. సుమారు 100 మంది మహిళలు వేసిన ముగ్గులు సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించాయి. కె.అరుణ, జ్ఞాన ప్రసూన, కవితలు విజేతలుగా నిలిచారు. విజేతలకు ఎన్‌సీఎస్ ట్రస్టు సభ్యులు నారాయణం పద్మశ్రీ బహుమతులు అందజేశారు.

గిరిశిఖర గ్రామంలో ఇంటింటి కొళాయిలు

శృంగవరపుకోట రూరల్: మండలంలోని బొడ్డవర పంచాయతీ గిరిశిఖర గ్రామమైన చిట్టంపాడులో ఇంటింటి కొళాయిలను స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శుక్రవారం ప్రారంభించారు. త్వరలోనే ఈ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు కలెక్టర్, సంబంధిత శాఖలతో మాట్లాడినట్లు తెలిపారు. కార్యక్రమంలో మురళీరాజు, సన్యాసిదేముడు, పంచాయతీ కార్యదర్శి బంగారు నాయుడు, గ్రామపెద్దలు, గిరిజన సంఘ నాయకులు ఉన్నారు.

టీడీపీతోనే భవిష్యత్తు



మాట్లాడుతున్న లలితకుమారి

శృంగవరపుకోట, జనవరి 12: ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును ఎన్నుకున్నప్పుడే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శుక్రవారం స్థానిక అన్న క్యాంటీన్ వద్ద ఎన్టీఆర్ సేవా సమితి, మాజీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తి ట్రస్టు సంయుక్తంగా సమకూర్చిన కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. టీడీపీ నేతలకు మాత్రమే సేవా గుణం ఉందన్నారు. గీతం యూనివర్సిటీ అధినేత ఎం.శ్రీభరత్ పేదలకు ఉచిత వైద్యం అందించడంతో పాటు ఉచితంగా కంటి అద్దాలను సమకూర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఒక్క చాన్స్ నినాదంతో గద్దెనెక్కిన సీఎం జగన్ రాష్ట్రాన్ని 25 ఏళ్ల వెనక్కి నెట్టారని ఆరోపించారు. విజన్ ఉన్న చంద్రబాబు నాయుడు మాత్రమే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించగలరన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జి.ఎస్.నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, మాజీ వైఎస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, నాయకులు కొండం మల్లేశ్వరరావు, కాపుగంటి శ్రీనివాసరావు, చక్క కిరణ్ కుమార్, అనకాపల్లి చెల్లయ్య, వాకాడ బాలు, భీశెట్టి అరుణ, భోనంగి జ్యోతి, మోపాడ చిన్ని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మునకలవలసలో వైసీపీకి భారీ షాక్

- 150 కుటుంబాలు టీడీపీలో చేరిక



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కోండ్రు

రేగిడి: మునకలవలసలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. మాజీ సర్పంచ్‌లు శాసపు జనానరావు, గార శ్రీనివాసరావు, శాసపు గంగరాజుతో పాటు 150 కుటుంబాలు శుక్రవారం మాజీ మంత్రి కోండ్రు మురళీ మోహనరావు ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కోండ్రు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు దూబ ధర్మారావు, గేదెల బాల మురళీధర్, వి.నాగభూషణరావు, గురవాన ధనంజయ్‌రావు, చల్ల భుజంగరావు, మాజీ జడ్పీటీసీ మంతిన ఉషారాణి పాల్గొన్నారు.

సంస్కృతీసంప్రదాయాలను పరిరక్షించుకోవాలి



వేడుకల్లో ఏఎస్పీ

దాసన్నపేట, జనవరి 12: సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ పరిరక్షించుకోవలసిన ఆవశ్యకత ఉందని జిల్లా అదనపు ఎస్పీ అస్మాపరహీన్ అన్నారు. శుక్రవారం మైత్రీ మీడియా, ఎస్సార్ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో సంయుక్తంగా గురజాడ కళాభారతి గ్రౌండ్‌లో రంగోలి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా ఏఎస్పీ హాజరై మాట్లాడుతూ భావితరాలకు చాటి చెప్పేందుకు, మగువల్లో కళా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు మైత్రీ మీడియా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తోందని, ముగ్గులు వేసే అలవాటును మరుగున పడిపోకుండా మన సంస్కృతిని కాపాడటం అభినందనీయమన్నారు. గెలుపొందిన విజేతలను ప్రోత్స హించేందుకు బంగారు అభరణాలతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో మైత్రీ మీడియా డైరెక్టర్ అవనాపు విక్రమ్, ఎస్ఆర్ షాపింగ్ మాల్ యాజమాన్యం, మైత్రీ మీడియా యాజమాన్యం సిబ్బంది పాలొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



ర్యాలీగా అక్షింతలు పంపిణీ

జామి: మండలంలోని భీమసింగి గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు బోడసింగి అప్పలరాజు, మజ్జి హరిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీగా ప్రతి ఇంటికీ అందించారు.

జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జనసేన ఇన్‌చార్జి, నాయకులు

బొబ్బిలి, జనవరి 12: సంక్రాంతి సందర్భంగా పారాది గ్రామంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పల స్వామి, వీర మహిళ నాయకురాలు బంటుపల్లి దివ్య ఆధ్వర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతిని ఉత్తరావల్లి శ్రావణి సాధించగా, బెల్లాన శశిరేఖ, ఆవాల గాయత్రిలు వరుసగా రెండు, మూడు బహుమతులను గెలుచుకున్నారు. వారికి ఉత్తరాంధ్ర మహిళా రీజినల్ కోఆర్డినేటర్ తుమ్మి లక్ష్మీరాజ్ బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మహంతి ధనంజయ్, బెల్లాన శ్రీను, పేకేటి సురేష్, పున్నాన శేఖర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు



వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణ

బొబ్బిలి, జనవరి 12: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బొబ్బిలి పట్టణంలోగల పలు వైష్ణవా లయాల్లో కూడారై వెల్లుం(ప్రత్యేక ప్రసాద నివేదన) కార్యక్రమాన్ని ఘ నంగా నిర్వహించారు. వేకువజామున ధనుర్మాస పూజలు, పల్లకీసేవ తదితర కార్యక్రమాలు ముగిసిన అనంత రం స్వామివారికి ప్రసాద నివేదన చేశారు. స్థానిక శ్రీ రుక్మిణీ సత్య భామా సమేత వేణుగోపాలస్వామి ఆలయం తోటలో నీరాటోత్సవం (ఆండాళ్ అమ్మవారికి స్నానం) కుడా రై ప్రసాద నివేదన కార్యక్రమాన్ని ఆల య అర్చకులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేశారు. కంచరవీధి శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, సింగారపువీధి శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో కూడారై వెల్లుం కార్యక్రమాన్ని అర్చకులు, ధర్మకర్తలు తదితరుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

టీడీపీ నాయకుడు గంటా రాజు మృతి



విజయనగరం రూరల్: టీడీపీ నాయకుడు, జమ్ము మాజీ సర్పంచ్ గంటా రాజు అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారుజామున జమ్ములోని ఆయన నివాసంలో మృతి చెందారు. రాజు మృతికి టీడీపీ విజయనగర నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, టీడీపీ జిల్లా నాయకులు ఐవీపీ రాజు, విజ్జపు ప్రసాద్, బొద్దల నర్సింగరావు, నాయకులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు తదితరులు సంతాపం తెలిపారు.

బాధిత కుటుంబానికి నగదు అందజేత

దత్తిరాజేరు: టి.బూర్జివలసకు చెందిన బానాపురపు నగేష్ విశాఖలోని జంతు ప్రదర్శన శాలలో పనిచేస్తూ ఇటీవల ఎలుగుబంటి దాడిలో మృతిచెందిన విషయం విధితమే. ఈ మేరకు ఆయన తల్లిదండ్రులకు విశాఖ జూ అధికారులు శుక్రవారం టి.బూర్జివలసలో రూ.10లక్షల చెక్కును అందజేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో బొబ్బిలికి గుర్తింపు

బొబ్బిలి, జనవరి 12: స్వచ్ఛ సర్వేక్షణ్ 20023-24 సంవత్సరానికి రాష్ట్ర స్థాయిలో బొబ్బిలి మున్సిపాలిటీకి ద్వితీయ స్థానం లభించింది. లక్ష లోపు జనాభా కలిగిన పురపాలక సంఘాలతో పోటీ పడి దక్షిణ భారతదేశంలో 8వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకును సాధించింది. ఇంటింటి చెత్త సేకరణ, తడి, పొడిచెత్తను వేరుగా సేకరించి ఎరువు తయారు చేసే ప్రక్రియ, పొడి చెత్త నుంచి ప్లాస్టిక్, పేపరు, క్లాత్ వ్యర్థాలను రీసైక్లింగ్ కోసం వినియోగించేలా జరుగుతున్న కృషికి మున్సిపాలిటీ ఈ అవార్డుకు ఎంపికైంది.

సమష్టి కృషితోనే

పట్టణ ప్రజలంతా సానుకూలమైన వైఖరి కలిగిన వారు కావడం అదృష్టం. ప్రతి రోజూ వేకువజామున క్షేత్ర స్థాయి సిబ్బంది పనితీరును స్వ యంగా పర్యవేక్షిస్తున్నాం. ఆ సమ యంలో స్థానికుల నుంచి వస్తున్న స్పందన ఆనందం కలిగిస్తోంది. పట్టణాన్ని గార్బేజ్ ఫ్రీగా తీర్చిదిద్దా లన్న సంకల్పానికి ప్రజల సహకా రం పుష్కలంగా ఉంది. పాలకవర్గ సభ్యులు సహకరిస్తున్నారు. ఈ అవార్డు వెనుక మా అందరి సమష్టి కృషి ఉంది.

-సత్తారు శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, బొబ్బిలి



బొబ్బిలి మున్సిపల్ కార్యాలయం

వైసీపీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారు

● జనసేన నాయకుడు గురాన అయ్యలు

విజయనగరం దాసన్నపేట: జిల్లాలో జరిగిన యువగళం, రా కదలిరా సభకు హాజరైన ప్రజానీకాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు మతిభ్రమించి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని జనసేన నాయకుడు గురాన అయ్యలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, ఓటమి తప్పదన్న భయంతో వైసీపీ నాయకులు కులాల మధ్య చిచ్చురేపుతున్నారని ఆరోపించారు. 2004లో కాంగ్రెస్ హయాంలో సాంబశివరాజు, శత్రుచర్ల, సుజయ్ పోటీ చేసినప్పుడు బీసీలు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. నేడు బీసీలకు అన్యాయం జరుగుతుందనడం హాస్యాస్పద మన్నారు. దమ్ముంటే మంత్రి బొత్స, చిన్న శ్రీనులు బేబీనాయనపై పోటీ చేయాలని సవాల్ విసిరారు.

22న రామతీర్థం వరకు శోభాయాత్ర

నెల్లిమర్ల: అయోధ్యలో ఈనెల 22న రామ మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని అదే రోజు జిల్లాలోని రామభద్రపురం నుంచి రామతీర్థం దేవస్థానానికి వందలాది మంది భక్తులతో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్టు నిర్వాహక కమిటీ ప్రతినిధులు కె.సత్యనారాయణ, ప్రసాద్ చెప్పారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని దేవస్థానంలో ఈవో బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్ కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. ట్రస్టు బోర్డు సభ్యుడు తిరుమరెడ్డి శ్రీనివాసరావు, సత్యం, హిందూ ధర్మ రక్షా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.వేణుగోపాల్, అర్చకులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

రామభద్రపురం: జిల్లాలో ప్రజల ఆరోగ్యం కోసం అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి భాస్కరరావు అన్నారు. బూసాయవలస హైస్కూల్‌లో శుక్రవారం ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఆరికతోట పీహెచ్‌సీ వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు టీడీపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

శృంగవరపుకోట: విశాఖ-అరకు రోడ్డుకు ఆనుకొని ఉన్న ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల వద్ద శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు విశాఖ పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గొంప కృష్ణ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆసక్తిగల వారు సత్యదేవి 7382155033 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. సమావేశంలో టీడీపీ మండల కార్యదర్శి జుత్తాడ రామసత్యం, లగుడు ఎర్నాయుడు, కరక భాస్కరరావు, అడారి రమేష్, దండుపాటి ఎర్రయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన

లక్కవరపుకోట: వ్యవసాయ పని, పంటల సాగుపై శ్రీకాకుళంకు చెందిన నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులకు విజయనగరం ఏరువాక కేంద్ర అధికారులు అవగాహన కల్పించారు. శుక్రవారం ఎల్.కోటలోని వ్యవసాయ క్షేత్రంలో పంటల సాగు, వ్యవసాయ పనులు ఎలా చేయాలో వివరించారు. కళాశాల డీన్ శ్రీనివాస్, ఏరువాక కేంద్ర అధికారి లక్ష్మణ్ 24 మంది విద్యార్థులకు వరి, అపరాల సాగు, కలుపు మొక్కల తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ అధికారి స్వాతి పాల్గొన్నారు.

సారా ప్యాకెట్లు స్వాధీనం

పాచిపెంట: సారా ప్యాకెట్లను అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని అరెస్టు చేశామని ఏఎస్ఐ ముసలయ్య శుక్రవారం తెలిపారు. పెద్దవలస గ్రామానికి చెందిన చందు, జంపయ్యలను అరెస్టు చేసి, 400 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

కోటి సంతకాల సేకరణ

● 32వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

● ప్రభుత్వానికి చిన్నచూపు తగదు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారంతో 32వ రోజుకు చేరుకుంది. ఇన్ని రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం తమ పట్ల చిన్నచూపు చూడడం తగదని అన్నారు. సమ్మెలో భాగంగా పలు చోట్ల శిబిరాల వద్ద కోటి సంతకాల సేకరణ చేపట్టారు. పండగ సమీపిస్తున్నా తమ డిమాండ్ సాధనకు పోరాటాలు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



గజపతినగరంలో..



కొత్తవలసలో..



బొబ్బిలి: అంగన్‌వాడీలకు మద్దతుగా సంతకాలు చేస్తున్న దృశ్యం



రామభద్రపురం: సంతకాలు చేస్తున్న ప్రజలు



రాజాం రూరల్: రిలే దీక్షలో పాల్గొన్న అంగన్‌వాడీలు

టీడీపీలో భారీగా చేరికలు

● సంగాంలో 60 కుటుంబాలు

వంగర: మండలం సంగాంలో సంగాం దేవాలయ మాజీ చైర్మెన్ బోను ఆనంద్ శుక్రవారం టీడీపీలో చేరారు. టీడీపీ రాజాం ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆనంద్, నర్సింగదొర, పొలం దొర, తదితరులతోపాటు సుమారు 60 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి కండువా కప్పి కోండ్రు పార్టీలోని ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిన్నింటి మోహనరావు, వాసుదేవరావునాయుడు, ఎల్ కృష్ణమూర్తి, ధనలక్ష్మి, శ్రీను, రవి, మురళీకృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.



ఆనంద్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోండ్రు

మెరకముడిదాంలో 175 కుటుంబాలు..

మెరకముడిదాం: మండలంలో అధికార పార్టీకి కోలుకోలేని దెబ్బతగిలింది. వైసీపీకి చెందిన 175 కుటుంబాలు ఒకేసారి తెలుగుదేశం పార్టీలో చేరాయి. శుక్రవారం రాత్రి టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, పార్టీ మండల అధ్యక్షుడు తాడ్డి సన్యాసినాయుడు ఆధ్వర్యంలో సోమలింగా పురం, గోప్పన్నవలసకు చెందిన 100 కుటుంబాలు, బిల్లలవలసకు చెందిన 25 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె.ధనుంజయ, ఎం.మోహన్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు తాడ్డి సన్యాసినాయుడు, కె.ధనుంజయ, ఎం.రమణమోహన్‌రావు, మండపాటి బంగార్రాజు, రమణరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో నాగార్జున

భవనాలు పూర్తయ్యాయి.. బిల్లులేవీ?

రామభద్రపురం: బూసాయవలస గ్రామంలో రైతు భరోసా, వెల్‌నెస్ భవనాలు నిర్మించి నెలలు కావస్తున్నా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతిరావు ఆవేదన వ్యక్తం చేశారు. బూసాయవలస గ్రామంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటివరకు ఈ భవనాలకు ఎంబుక్‌గానీ, రికార్డింగ్‌గానీ చేయలేదని.. రూ.లక్షలు ఖర్చు పెట్టి భవనాలు నిర్మిస్తున్న వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటి కైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని పెండింగ్ బిల్లులు చెల్లించే విధంగా ఆదేశాలు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పోటీ పరీక్షలకు ఉచితంగా మెటీరియల్

గజపతినగరం: నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా ఉచిత స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈనెల 18లోగా ఉచిత మెటీరియల్ కోసం టీడీపీ కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవా లని కోరారు. ఎ.లక్ష్మునాయుడు, కొండపల్లి భాస్కరనాయుడు, కోరాడ కృష్ణ, పీవీవీ గోపాలరాజు, బి.బాలాజీ, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

వైసీపీ జెండాను పీకేశారు

● పొనుగుటివలసలో అధికార పార్టీకి భంగపాటు

● ఇన్‌చార్జి సహా నాయకులను నిలదీసిన యువత

● మూడు నెలల్లో మీ ప్రభుత్వం పోతుందంటూ స్పష్టం

రాజాం రూరల్, జనవరి 12: రాజాం మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో కొంతమంది యువతతో పాటు గ్రామస్థులు వైసీపీ జెండాను పీకి పక్కన పడేశారు. ఆపార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్‌తో పాటు రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు తదితర నాయకులను అడ్డుకుని సమస్యలపై నిలదీశారు. గ్రామంలోకి ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. వారి ప్రశ్నలకు జవాబులిచ్చేందుకు పాలవలస శ్రీనివాసరావు తదితర నాయకులు ప్రయత్నించినా యువత అంగీకరించలేదు. దీంతో అర్థాంతరంగా నాయకులు గ్రామాన్ని విడిచిపెట్టాల్సి వచ్చింది. 'జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి అధికారపార్టీ నాయకులు గ్రామానికి వచ్చినపుడు ఈ ఘటన చోటుచేసుకుంది.

ఎదురు తిరిగిన యువత

గ్రామానికి చెందిన కొందరు యువకులు వైసీపీ నాయకులకు ఎదురుతిరిగారు. పార్టీకోసం కష్టబడి పనిచేశామని, ఎమ్మెల్యే గెలుపు కోసం చాలా శ్రమించామని అయినా తమకు, తమ గ్రామానికి ఏం చేశారని ప్రశ్నించారు. డ్వాక్రా సంఘాల సభ్యులు రూ.లక్షల్లో నష్టపోయారని, నిధులు ఆర్బీలు స్వాహా చేస్తే కార్యాలయాలు, బ్యాంకులు, పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగినా ఒక్కరు కూడా సహాయం చేయలేదని మరికొందరు నిలదీశారు. గ్రామానికి మంజూరైన పింఛన్లను రద్దు చేశారని కొందరు నిలదీశారు. గ్రామంలో రైతుబరోసా కేంద్రం ఎందుకు నిర్మించలేదన్న యువత ప్రశ్నకు రేపు వస్తే ఏర్పాటు చేసే ప్రయత్నం చేద్దామని పాలవలస శ్రీనివాసరావు చెప్పేందుకు చేసిన ప్రయత్నాలను యువత అడ్డుకున్నారు. 'ఇంకెప్పుడు చేస్తారు.. మరో మూడు నెలల్లో ప్రభుత్వమే పోతుంది. ఇంకేం చేస్తార'ంటూ కేకలు వేశారు. గ్రామంలో జెండా ఎగురవేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశం పెట్టొద్దని, గ్రామం విడిచి వెళ్లిపోవాలని సూచించారు. జెండా ఎగురవేయకుండానే జెండా కర్రను పీకేసి పక్కన పడవేశారు. దీంతో వైసీపీ నాయకులు కొద్దిసేపు గ్రామంలో ఉండి వెనక్కి వెళ్లిపోయారు.



వైసీపీ నాయకులను నిలదీస్తున్న యువత



జెండా కర్రను పీకేసిన దృశ్యం

ఘనంగా వివేకానంద జయంతి

వివేకానంద జయంతి వేడుకలను జిల్లాలోని పలుచోట్ల శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి, అలాగే కూడళ్లలో ఉన్న ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

-ఆంధ్రజ్యోతి బృందం



గజపతినగరం: మరుపల్లిలో..



వంగర: వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



గంట్యాడ: మురపాకలో



నాగూరులో..



బొబ్బిలి: తారకరామాకాలనీలో..



కొత్తవలసలో ర్యాలీ నిర్వహిస్తున్న వివేకానంద సేవా సమితి సభ్యులు



విజయనగరం: నివాళులర్పిస్తున్న వాజీ చానెల్ ఎండీ శ్రీనివాసరావు, కుసుమంచి సుబ్బారావు



పాలకొండ: ప్రాథమికోన్నత పాఠశాలలో..